quicktodaynews.com
RNI NO : TELTEL/2023/86487

# క్విక్ టుడే

ANDHRA PRADESH
దినపత్రిక
ఆంధ్రప్రదేశ్

సంపుటి-2 సంచిక-12 ఆదివారం 22 సెప్టెంబర్ 2024

## తిరుమల లడ్డూ వివాదంపై

# విచారణ జరగాలి



**ప్రధానికి, సుప్రీం చీఫ్ జస్టిస్‌కు లేఖ రాస్తాం**

**సిఎం చంద్రబాబు ఆరోపణలపై నిగ్గు తేల్చాలి**

**పెదవి విప్పిన వైకాపా ప్రధాన కార్యదర్శి సజ్జల**

**అమరావతి, సెప్టెంబర్21 (క్విక్ టుడే న్యూస్):** శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలని కోరుకుంటున్నట్లు తిరుమల లడ్డూ వివాదంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి స్పందించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ కు లేఖ రాస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఆరోపణలు చేసింది ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లడ్డూలో కల్తీ నెయ్యి వాడటం కాదు జంతువుల కొవ్వు వాడుతున్నారని ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. ఇక, జంతువుల కొవ్వు కలిపారాన్న బాబు ఆరోపణలపై సమగ్ర విచారణ జరగాలి అని డిమాండ్ చేశారు. టీటీడీ చేసిన టెస్టులో జంతు కొవ్వు ఆనవాలు లేవు అని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆవులు తినే ఆహారం బట్టి పాలల్లో లక్షణాలు ఉంటాయి.. ఆవులు ఎక్కడైనా మాంసం తింటాయా అని ప్రశ్నించారు. నెయ్యి తయారీ కంటే ముందే పాలు టెస్ట్ చేసి పంపుతారు.. టెస్ట్ చేయకుండా అనుమతి ఇవ్వరు.. టెస్ట్ లో తేడా వస్తే వెనక్కి పంపుతారు అని చెప్పుకొచ్చారు. చంద్రబాబు డైరీ యజమాని.. ఆయన అమ్మే దాంట్లో కూడా ఇతర జంతు కొవ్వు ఉంటుందా..? అని పేర్కొన్నారు. ల్యాబ్ రిపోర్ట్ నెగిటివ్ అని వచ్చింది.. కానీ చంద్రబాబు మాత్రం ఇతర జంతు కొవ్వు ఉందంటున్నారు.. దీనిపై సమగ్ర విచారణ జరపాలి.. తిరుమలకు ఉన్న నమ్మకాన్ని పెంచాలి.. ఇలా పొగొట్ట వద్దని సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు.

## లడ్డూ వ్యవహారంలో

# దోషులను వదిలేది లేదు

**ఎంతటి వారైనా కఠినంగా శిక్షించి తీరుతాం**

**లోతుగా విచారణ జరగాల్సిన అవసరం ఉంది**

**అన్ని దేవాలయాల్లో పరీక్షలు, సంప్రోక్షణ కార్యక్రమాలు**

**ఆరోపణలు వస్తే ఎదరుదాడితో జగన్ విమర్శలు**

**మండిపడ్డ సీఎం చంద్రబాబు నాయుడు**



**అమరావతి, సెప్టెంబర్21 (క్విక్ టుడే న్యూస్):** తిరుమల లడ్డూ వ్యవహారంలో దోషులను వదిలేది లేదని, ఎంతటి వారైనా కఠినంగా చర్యలు ఉంటాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి తీవ్రంగా స్పందించారు. తిరుమల లడ్డూ విషయంలో జగన్ చర్యల వల్ల భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. ఇది చాలా సున్నితమైన అంశం అని, దీనిపై లోతుగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం నాడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో సీఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. రోజూ మూడుసార్లు పరీక్షలు చేశామని ఎవరిని మభ్యపెడుతున్నారంటూ వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైఎస్ ఏడు కొండలను.. రెండు కొండలు అన్నాడని.. అప్పుడు పోరాడామని సీఎం చెప్పారు. అమరావతిలో రూ. 250 కోట్లతో శ్రీవారి టెంపుల్ కడదామని భావిస్తే.. దానిని కుదించారన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పరీక్షలు, సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడతామని సీఎం చెప్పారు.జగన్ పాలనలో దేవుళ్ల విగ్రహాలను ధ్వంసం చేసే ఎన్నో దుస్సాహాలు చేశారని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని అన్నారు. తిరుమల వెంకన్న స్వామితో ఎవరూ ఆటలాడకూడదన్నారు. రాష్ట్రంలోని దేవాలయాలు అన్నింటిలో తనిఖీలు చేపిస్తున్నామని సీఎం చెప్పారు. కిలో 600 రూపాయలు పైన అమ్మే నెయ్యి 320 రూపాయలకే ఎలా లభించిందని సీఎం ప్రశ్నించారు. రివర్స్ టెండరింగ్ పేరుతో వ్యవస్థలన్నిటిని సర్వనాశనం చేశారంటూ జగన్‌పై సీఎం చంద్రబాబు ఫైర్ అయ్యారు. తిరుమల పవిత్రతను కాపాడే అంశంపై వేద పండితులు, మఠాధిపతులతో చర్చలు జరుపుతామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయాల్లో అనేక అపచారాలు జరిగాయని సీఎం చంద్రబాబు విమర్శించారు. రామతీర్థంలో రాములవారి విగ్రహ తల తొలిగిస్తే దిక్కులేకుండా పోయిందన్నారు. నిందితులపై కనీసం చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇలా ఒక్కటని కాదు.. నాటి ప్రభుత్వం చెయ్యని తప్పులేదని సీఎం అన్నారు. నాడు ప్రజల సెంటిమెంట్స్‌తో ఆడుకున్నారని.. ప్రజల మనోభావాలకు విలువ ఇవ్వలేదని విమర్శించారు. పోలవరం, అమరావతి నాశనం చేసి.. వాటిపైనా ఎదురుదాడి చేసి తప్పుడు ప్రచారం చేశారని జగన్ పాలనా తీరును సీఎం చంద్రబాబు తూర్పారబట్టారు. జగన్ తన సొంత బాబాయి హత్య విషయంలో ఎలా బుకాయించారో.. నేడు ప్రకాశం బ్యారేజీలో బోట్ల విషయంలోనూ అలాగే మాట్లాడుతున్నారని విమర్శించారు. అందుకే వీళ్లను కొలంబియా నేరస్తుడు, మాఫియా డాన్ పాబ్లో ఎస్కోబార్‌తో పోల్చానని సీఎం చంద్రబాబు చెప్పారు.

## కల్తీ నెయ్యితో

# తిరుమల అపవిత్రం

## కల్తీ నెయ్యితో తిరుమల అపవిత్రం

**ఆలయ సంప్రోక్షణకు టీటీడీ నిర్ణయం**

**23 నుంచి 25 వరకు శాంతియాగం నిర్వహణ**

**వేదపండితులు, రుత్వికులతో శ్రీవారికి ప్రత్యేక పూజలు**



తిరుమల,సెప్టెంబర్21(ఆర్ఎన్ఎ): కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడి మహా ప్రసాదమైన లడ్డూలో కల్తీ నెయ్యి వాడిన నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం కీలక నిర్ణయం తీసుకుంది. ఆలయాన్ని సంప్రోక్షణ చేయాలని ఇప్పటికే నిర్ణయించిన టీటీడీ ఆ క్రతువులో భాగంగా తొలుత మహా శాంతియాగాన్ని నిర్వహించాలని శనివారం నిర్ణయించింది. మూడు రోజులపాటు ఈ క్రతువు నిర్వహించ నున్నారు. సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు శాంతియాగాన్ని జరపనున్నారు. వేదపండితులు, రుత్వికుల నడుమ శ్రీ వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. తిరుమల శ్రీవారి వారి లడ్డూలో వాడకూడని పదార్థాలను వినియోగించిన నేపథ్యంలో లడ్డూలు తయారు చేసే పోటుతో పాటు, నెయ్యి భద్రపరిచిన ప్రదేశాలను సంప్రోక్షణ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ మేరకు పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. టీటీడీ ఈవో, అధికారులతో శుక్రవారం రెండుసార్లు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనికి ముందు.. గత వైసీపీ హయాంలో శ్రీవారి లడ్డూ తయారీలో నాణ్యతా లోపాలు, అపవిత్ర పదార్థాల వాడకంపై సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. లడ్డూ తయారీ విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పిదాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని టీటీడీ ఈవో శ్యామలరావును సీఎం ఆదేశించారు. తిరుమల పవిత్రత కాపాడే విషయంలో ఆగమ, వైదిక, ధార్మిక పరిషత్‌లతో చర్చలు జరుపుతామని ప్రకటించారు. భక్తుల విశ్వాసాలను, ఆలయ సాంప్రదాయాలను కాపాడతామని హామీ ఇచ్చారు. తిరుమల సంప్రోక్షణకు సంబంధించిన విధివిధానాలు తెలియజేసేలా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం దృష్టి పెట్టింది.

## సింహాద్రి అప్పన్న

# ప్రసాందలోనూ నాణ్యతలోపం

**నెయ్యి రుచిచూసిన ఎమ్ఎల్యే గంటా పెదవి విరుపు**

**విశాఖపట్టణం, సెప్టెంబర్21 (క్విక్ టుడే న్యూస్):** సింహాచలం ఆలయంలో ముడిసరుకుల నాణ్యతను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు పరిశీలించారు. నెయ్యి రుచి చూసి ఆయన పెదవి విరిచారు. ప్రసాదం లడ్డూలోనూ నెయ్యి వాసన లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సింహాచలం ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం గంటా మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కిలో నెయ్యి రూ.591 నుంచి రూ.391కి తగ్గిపోయింది. ఎక్కడో ఉత్తరప్రదేశ్‌లో ఉన్న సంస్థ రూ.391 సరఫరా చేస్తుందంటే ఎలా నమ్మగలం. నేను చాలా ఆదా చేస్తున్నాను అన్న పేరు తెచ్చుకోవాలని జగన్మోహన్ రెడ్డి రివర్స్ టెండరింగ్ వల్ల వచ్చిన అనర్థాలు ఇవి అని గంటా మండిపడ్డారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్న జగన్మోహన్ రెడ్డికి ఏం శిక్ష విధించాలో జనం, భక్తులు నిర్ణయించాలి. వైకాపా నేతలు తిరిగి ఇప్పటి ప్రభుత్వం మీద ఎదురు దాడి చేస్తున్నారు. విజిలెన్స్, ఫుడ్ క్వాలిటీ విభాగాల నుంచి కూడా అధికారులు వచ్చి వీటిని తనిఖీ చేస్తున్నారు. ఏ స్థాయి వ్యక్తులు ఇందులో ఇన్వాల్వ్ అయి ఉన్నారన్నది ఇప్పుడు ప్రశ్న. దేవాలయాలకు పూర్వ వైభవం తెచ్చేటట్లుగా, ప్రసాదాలు నాణ్యంగా ఉండేటట్లుగా ఈ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. వ్యవస్థలను చక్కదిద్దడానికి చంద్రబాబు నేతృత్వంలో ప్రభుత్వం ప్రయత్నిస్తోందని గంటా అన్నారు. అన్న ప్రసాదం స్వీకరించిన భక్తులతోనూ గంటా శ్రీనివాసరావు సంభాషించి నాణ్యతపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.



## శ్రీవారి లడ్డూలో

# కల్తీతో మహాపచారం

**ప్రాయశ్చిత్త దీక్షకు పవన్ నిర్ణయం**

**నేటి నుంచి 11 రోజులపాటు దీక్ష**

**తరవాత శ్రీవారిని దర్శించుకుంటానని వెల్లడి**

**అమరావతి, సెప్టెంబర్21 (క్విక్ టుడే న్యూస్):** తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్రంగా స్పందించారు. కలియుగ ప్రత్యక్ష దైవం బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందేనన్నారు. అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం గత పాలకులు వికృత పోకడల ఫలితంగా అపవిత్రమైంది. జంతు అవశేషాలతో మలినమైంది. విశృంఖల మనస్కులే ఇలాంటి పాపానికి ఒడిగట్టగలరు. లడ్డూ ప్రసాదంలో జంతు అవశేషాలు ఉన్నాయని తెలిసిన క్షణం నా మనసు కలత చెందింది. అపరాధ భావానికి గురైంది. ప్రజా క్షేమాన్ని కాంక్షించి పోరాటంలో ఉన్న నా దృష్టికి ఈ అంశం రాకపోవడం బాధించింది. కలియుగ ప్రత్యక్ష దైవమైన బాలాజీకి జరిగిన ఈ ఘోర అపచారానికి సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ప్రాయశ్చిత్తం చేసుకోవలసిందే. అందులో భాగంగా నేను 'ప్రాయశ్చిత్త' దీక్ష చేయాలని సంకల్పించానని వెల్లడించారు. ఆదివారం గుంటూరు జిల్లా నంబూరులోని శ్రీదశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష చేపడతా. 11 రోజులపాటు దీక్ష కొనసాగించిన అనంతరం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుంటా. 'దేవదేవా... నీ పట్ల గత పాలకులు చేసిన పాపాలను ప్రక్షాళన చేసే శక్తిని ఇవ్వమని వేడుకుంటానని అన్నారు. భగవంతుడిపై విశ్వాసం, పాప భీతి లేనివారే ఇలాంటి అకృత్యాలకు ఒడిగడతారు. నా బాధేమిటంటే- తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవస్థలో భాగమైన బోర్డు సభ్యులు, ఉద్యోగులు సైతం అక్కడి తప్పిదాలను కనిపెట్టలేకపోవడం. కనిపెట్టినా నోరు మెదపకపోవడం. నాటి రాక్షస పాలకులకు భయపడి మిన్నకుండిపోయారా అనిపిస్తోంది. వైకుంఠ ధామంగా భావించే తిరుమల పవిత్రతకు, వేదాచారాలకు, ధార్మిక విధులకు కళంకం తెచ్చే విధంగా పెడపోకడలకు పాల్పడిన గత పాలకుల తీరు హిందూ ధర్మాన్ని పాటించే ప్రతి ఒక్కరినీ బాధించింది. ఇక లడ్డూ ప్రసాదం తయారీలో జంతు అవశేషాలు ఉన్న నెయ్యిని వినియోగించారనే విషయం తీవ్ర క్షోభకు గురి చేసింది. ధర్మాన్ని పునరుద్ధరించుకొనే దిశగా అడుగులు వేసే తరుణం ఆసన్నమైంది. ధర్మో రక్షతి రక్షితః అని పవన్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.



## వరదసాయంపై

# సీఎం చంద్రబాబు సమీక్ష

**ఇప్పటికే ఎన్యుమరేషన్ పక్రియ పూర్తి**

**అమరావతి, సెప్టెంబర్21 (క్విక్ టుడే న్యూస్):** భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలకు పరిహారం అందజేతపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులతో ఎన్యుమరేషన్ పక్రియ, పరిహారం చెల్లింపుపై రివ్యూ చేశారు. ఇప్పటికే ఎన్యుమరేషన్ పక్రియ పూర్తి అయ్యిందని అధికారులు సీఎంకు తెలిపారు. దీంతో ఈనెల 25వ తేదీన బాధితులకు పరిహారం అందించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. విజయవాడలో వరదకు మునిగిన ఇళ్లలో గ్రౌండ్ ఫ్లోర్ వారికి రూ.25 వేలు, మొదటి, ఆపై అంతస్తు వారికి రూ.10 వేల చొప్పున నష్ట పరిహారం అందిస్తామని సీఎం చంద్రబాబు అన్నారు. కాగా, చనిపోయిన పశువులకు, నష్టపోయిన వ్యాపారులకు కూడా ఆర్థిక సాయం అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన పరిహారం అన్ని వర్గాల బాధితులకూ ఒకే సారి చెల్లించనుంది. ఇళ్లు మునిగిన వారితో పాటు వాహనాలు దెబ్బ తిన్న వారికి పంటలు దెబ్బ తిన్న రైతులకు నష్ట పరిహారం డబ్బులు బుధవారం అకౌంట్లలో నేరుగా ప్రభుత్వం జమ చేయనుంది. పరిహారం విషయంలో తమ పేరు నమోదు కాలేదు అనే ఫిర్యాదు ఎక్కడా రాకూడదని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. 10 వేల వాహనాలకు గాను ఇప్పటి వరకు 6 వేల వాహనాలకు బీమా సెటిల్మెంట్ పూర్తి అయిందని అధికారులు చెప్పారు.

## టీటీడీ నిర్ణయాలపై

# విజిలెన్స్ విచారణ

**హైకోర్టులో సవాల్ చేసిన వైవీ సుబ్బారెడ్డి**



**అమరావతి, సెప్టెంబర్21 (క్విక్ టుడే న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్ గా తీసుకున్న నిర్ణయాలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రభుత్వం తనపై చేపట్టనున్న విజిలెన్స్, ఎన్ ఫోర్స్మెంట్ విచారణను రద్దు చేయాలని కోరుతూ వైవి. సుబ్బా రెడ్డి హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సోమవారం విచారణ జరుపనున్నది.' నేను తీసుకున్న నిర్ణయాలపై వివరణ ఇవ్వాలని విజిలెన్స్, ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్పీ కోరారు. నాపై ఆరోపణలు ఏమిటి? అని అడిగితే, అందుకు సంబంధించిన దస్త్రాలు ఇవ్వమని కోరితే స్పందించలేదు. నా వివరణలు లేకుండానే విచారణ పూర్తి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం వ్యవహారాల్లో విచారణ జరిపే అధికారం రాష్ట్ర విజిలెన్స్ విభానికి లేదు. టిటిడికి స్వయం ప్రతిపత్తి ఉంది. అంతర్గత విషయాలు విచారించేందుకు టిటిడికి స్వంత విజిలెన్స్ విభాగముంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర విచారణ పక్రియను ఆపుతూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలి' అని ఆయన ఆప్ర హైకోర్టును కోరారు. అంతేకాక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి, టిటిడి ఈవో, విజిలెన్స్, ఎన్ ఫోర్స్మెంట్ డైరెక్టరేట్, ఎస్పీలను తన పిటిషన్ లో ప్రతివాదులుగా చేర్చారు.

## టిటిడికి స్వచ్ఛమైన పాల

# ఉత్పత్తులు అందిస్తాం

**విజయ డెయిరీ ద్వారా అందించేందుకు సిద్ధం**

**టిటిడి ఇవోకు ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ లేఖ**

**హైదరాబాద్, సెప్టెంబర్21 (క్విక్ టుడే న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానంలో ప్రసాదాల కోసం స్వచ్ఛమైన, నాణ్యమైన ఉత్పత్తులను సరఫరా చేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలంగాణ ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీ తెలిపింది. ఈ మేరకు తితిదే ఈవో జె.శ్యామలరావుకు లేఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనను పశుసంవర్ధకశాఖ ముఖ్యకార్యదర్శి సబ్యసాచి ఘోష్ తెలిపారు. దేశవ్యాప్తంగా పాలు, పాల ఉత్పత్తుల రంగంలో తెలంగాణ విజయ డెయిరీ ప్రసిద్ధి చెందింది. వినియోగదారులకు విలువైన, నాణ్యమైన ఉత్పత్తులు సరఫరా చేసిన చరిత్ర ఉంది. విజయ డెయిరీ ఉత్పత్తుల్లో నాణ్యత నిర్ధరించడంతో పాటు లక్షలాది మంది పాల రైతుల జీవనోపాధికి సంస్థ తోడ్పడుతోంది. తితిదేకు అధిక నాణ్యత గల నెయ్యి, ఇతర పాల ఉత్పత్తుల అవసరాలన్నింటినీ తీర్చడానికి మా సంస్థ సన్నద్ధతలను తెలియజేస్తున్నాం. విజయ డెయిరీ ప్రభుత్వ సంస్థ అయినందున సరఫరాలో స్వచ్ఛత, నాణ్యత, ధరల విషయంలో పూర్తి పారదర్శకంగా ఉంటుంది. దేవస్థానం, భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించాలని లేఖలో పేర్కొన్నారు. విజయ డైరీ ఉత్పత్తులలో నాణ్యతను నిర్ధారించడంతో పాటు, లక్షలాది మంది పాల రైతుల జీవనోపాధికి సంస్థ తోడ్పడుతుందని ఆయన తెలిపారు.